


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -165-

**(25 జూలై 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**మొన్న ఒక పెద్దమనిషి** వచ్చి మాట్లాడుతూ "కళలు, కళలంటారేమిటండీ? కళలకుండే గౌరవం ఎవరు నిలబెడుతున్నారండీ? నిజానికి దేశంలో కళలకంటె పిచ్చకళలే ఎక్కువవుతున్నాయి" అన్నాడు.

"కళలన్నిటిమీదా అలా ఎర్రసిరా గీత పెట్టేశారేమిటి ఒక్కసారిగా దేశంలో వాటికి స్థానమే లేదంటారా? కళారాధన పూర్తిగా నశించిపోయిందంటారా?" అన్నాను.

"పూర్తో, అసంపూర్తో నాకు తెలియదు. మొత్తం మీద కళారాధన చాలావరకు కుంటుపడిపోతోంది. ఏదోవిధంగా కళల పేరుతో చింతామణి అవడం జరుగుతోంది గాని – వాటి పవిత్రతా, ప్రాబల్యం ఎక్కడ కనపడుతున్నాయండీ.. ఇదంతా క్షీణ యుగం.. అతి క్షీణయుగం" అన్నాడాయనగారు ఎంతో నైరాశ్యంతో.

ఒకసారి ప్రఖ్యాత దర్శకుడు శాంతారామ్ రేడియోలో "అనుమతి లేనిదే లోపల ప్రవేశించరాదు" అన్న శీర్షికమీద మాట్లాడాడు. ఇక్కడ 'లోపల' అనేదానికి కళాప్రపంచంలో అని అర్థం. 'అనుమతి లేనిదే ' అనే దానికి అర్హత లేనిదే అని అర్థం.

ఈవిధంగా ఆలోచిస్తే ఎంతమంది కళాసాహిత్య రంగాలలోకి 'దురాక్రమణలు' జరుపుతున్నారో అర్థమవుతుంది. ఒకాయన ఈ సందర్భంలో మాట్లాడుతూ "బంజరు భూములలో బీదల ఆక్రమణ" అన్నదానికైై నాకొంత అర్థం వుందిగాని – కళాసాహిత్య రంగాలలోకి దౌర్జన్య ప్రవేశం అనడంలో ఎంతమాత్రం అర్థంలేదు సరికదా అనర్థం కూడా వుంది" అని బాహాటంగా వెల్లడించాడు.

కాని కళాసేవలో నిమగ్నులు కావడం అనే ప్రవచనాన్ని మాత్రం ఎవరూ వదలిపెట్టడంలేదు. "కళా ప్రయోజనాలనాశించి ప్రజాభ్యుదయాన్ని గుర్తించి, సేవాభావాన్ని వరించి, ఈ కార్యక్రమం తలపెట్టాం" అని చాలామంది ఉపన్యసిస్తూ వుండటం వింటూ వుంటాం.

చిత్రం విడుదల చేయకముందే, ప్రజల జయజయధ్వానాలు మిన్నుముట్టకముందే కొన్ని కొన్ని సందర్భాలలో సగం చిత్రంకూడా పూర్తికాకముందే "త్వరలో మా అత్యుత్తమ కళాఖండం విడుదలై, అశేష జనాన్ని ఆనందపరవశుల్ని చేయబోతున్నది" అనే ప్రకటనలు కనిపిస్తూ వుంటాయి పత్రికల్లో.

తాము చేయబోయే పనిమీద అంత గౌరవం వుండటం మెచ్చుకోతగిన విషయమే. కాని ఆ ఆశయాన్ని రూపొందించడంలో వెనుక ఎడిటర్ ఒక్కటే కొంచెం విచారించవలసిన విషయం –

పూర్వం కొన్ని చిత్రాలు ఇప్పటి వసతులు లేక ఆటలు దృశ్యాలతో, అదోమాదిరి ఆహార్యంలో, ఎవరికి వారు పాడే సంగీతంతో ఏదో ఒక పద్ధతిలో తయారుచేసి బయట పడేసేవారు.

కాని వాటికి సంబంధించిన ప్రకటనలు మాత్రం ఇలా వుండేవి. "కన్నులు మిరుమిట్లు గొలిపే దృశ్యాలు...నటీనటుల అతి సహజమైన, అద్భుతమైన హావభావవిన్యాసాలు, శ్రవణానందదాయకమైన, మధురాతి మధురమైన సంగీతం ఈ అన్ని హంగులతో మా చిత్రరాజం త్వరలో విడుదల కాబోతోంది" అని ప్రకటన జరిగేది.

కళ్ళు మిరుమిట్లు గొలపడం మాట అలావుంచి, ఆ దృశ్యాలు చూస్తుంటే కంట్లో రాకాసిబొగ్గు నలకలు పడ్డంత బాధగా వుండేది. నటీనటుల ఆహార్యం చూస్తుంటే పూర్వపు రాజులు, రాణులూ ఇలాగే వుండేవారా? అందుకనే అలా ఎక్కువకాలం అంతఃపురాలలో పడివుండేవారు కాబోలు అనే ఆశ్చర్యం కలిగేది

పోతే ఆనాటి సంగీతంలో మాత్రం కొంతవరకు సహజత్వం, మాధుర్యం వుండేదనడంలో సందేహంలేదు. లక్కీగా "కళాత్మక" భావాలన్నీ – 'విస్మయాత్మకం'గానే వుండేవి.

ఇటీవల ఒక పెద్ద మనిషి వచ్చాడు. ఎవరో గొప్ప చిత్రకారుడు కావాలని ప్రకటన చేశారు. దానికి అనౌన్స్ చేస్తున్నానని చెప్పాడు. 'మంచిదే' తప్పక చెయ్యండి  అన్నాను.

"ఇదివరలో నేను మీతో కొంతకాలం పనిచేశాను జ్ఞాపకం వుందా?" అన్నాడు.

"అయ్యో! అదెలా మరచిపోతాను" అన్నాను.

"మరిచిపోలేదుగదా – అయితే నాకో మంచి సర్టిఫికెట్ ఇవ్వండి. అప్లికేషన్‌తో కలిసి పంపుతాను" అన్నాడు.

"అయ్యో! అంతపనే  నా సర్టిఫికెట్ ఏం లాభం. ఎవరన్నా పెద్దవాళ్ళదగ్గర, చిత్ర కళారాధకుల దగ్గరా తీసుకోండి" అన్నాడు.

"నేను మిమ్మల్ని గొప్ప కళారాధకులుగా గుర్తిస్తున్నాను. మీరు వాళ్ళని గొప్ప కళాకారునిగా గుర్తిస్తారని నా నమ్మకం" అన్నాడు.

"వద్దులెండి. మన గుర్తింపులవల్ల అసలు కళకు బర్తరఫ్ జరుగుతుంది. కనుక పెద్దవాళ్ళ దగ్గర ప్రయత్నించండి. దొరక్కపోతే ఆలోచిద్దాం" అని పంపాను యెలాగో.

ఆయనగారు మాతో కలిసి పనిచేసినప్పుడు ఏనుగు స్వరూపాలు మార్చివేసేవాడు. గుర్రం వేస్తే అది ఏ దేశంలో గుర్రమో, ఏకాలం నాటిదో గుర్తించడం కష్టంగా వుండేది.

ఒకసారి ఆయన గుర్రాన్ని ఆయనకే చూపించి "ఇది ఏ టైపు అశ్వమండి. పోనీ చిత్రం క్రింద వ్రాద్దాం.. పాఠకుడికి కొంత బోధన చేసినవాళ్ళమవుతాం" అన్నాను.

ఆయన ఆ బొమ్మవంక ఒక అయిదు నిముషాలు చూచి "ఇది అశ్వమేధం టైపుసార్" కొంచెం కళాత్మాకంగా వుంటుందని అది వేశాను. ఈ కాలంలో గుర్రాలదేం వుంది .చాలా చీప్.." అన్నాడు. అంతటి మహా చిత్రకారుడికి సర్టిఫికెట్ ఇవ్వడమంటే నావంటివాడికి సాధ్యమా మరి.

అసలు ఏది కళో, ఏది కాదో నిర్ణయించే పరిస్థితులు కూడా కనిపించడంలేదు. ప్రతి వ్యక్తి నేను జీవించేది కళకోసమే అంటాడు. దానితోనే తరించాలంటాడు. దానికోసమే మనం అర్థం చేసుకోవడం కష్టమైనా, అతడు మాత్రం ఆ ధైర్యంతోనే జీవిస్తాడు. మా బంధువుల్లో ఒకాయనకు ప్రతిరోజూ భార్యతో పోట్లాట తప్పదు. కొన్ని ముక్తాయింపు అయిపోయిన తర్వాత వచ్చి వాకిట్లో కూర్చుని ఆకాశం వంక చూడటం ప్రారంభిస్తాడు.

ఎవరైనా వచ్చి "ఏమిటలా నిశ్చింతగా కుర్చున్నారు" అని ప్రశ్నిస్తే "కళోపాసనలో సిద్దిపొందినవాడికి నిశ్చింతకాకపోతే ఏం వుంటుంది. ఆ నీలాకాశంలోకి చూస్తున్నాను. ప్రకృతిలో గల అత్యద్భుత శిల్పం నా మస్సును అరికట్టివేసింది. ఆ తెలిమబ్బు ఉయ్యాల తొట్టెతో నా మనస్సూ ఉయ్యాలలూగుతోంది. ఆహానా" అనేవాడు.

ఇంట్లో అంతకు ముందు వినిపించిన ఫెళఫెళార్భాటములలోనుంచి ఆయనగారికి అలాటి కళాదర్శనమయ్యేది కాబోలు పాపం.

Post your comments